# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ 2047 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో రాష్ట్రంలో 1.17 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ❖ ఆయుష్ శాఖను పటిష్ట పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- ❖ బాలికలు, మహిళలపై దుశ్చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ స్పష్టం చేశారు.

====================

భారతదేశం 2047 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం ఈదగాలిలో విశ్వసముద్ర ఇథనాల్ ప్లాంట్ ను ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. భవిష్యత్‌లో దేశం ఆర్థికంగా అగ్రస్థానంలో నిలుస్తుందని, అప్పుడు ఆంధ్రప్రదేశ్ కూడా దేశంలో అగ్రిగామిగా రూపొందుతుందని అన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నామని, 88 వేల కోట్ల రూపాయలతో దేశ చరిత్రలోనే అతిపెద్ద పెట్టుబడిగా విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోందని చెప్పారు. అదేవిధంగా రామాయపట్నం వద్ద బీపీసీఎల్ సంస్థ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీని ఏర్పాటు చేయనుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

====================

ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ఈరోజు అమరావతిలోని సచివాలయంలో జరిగింది. కేబినెట్ సమావేశ వివరాలను రాష్ట్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు తెలియజేశారు. మొత్తం 1.17 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వెల్లడించారు. 88 వేల కోట్ల రూపాయల భారీ పెట్టుబడితో గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేసేందుకు కేబినెట్ ఆమోదం లభించిందన్నారు. శ్రీశైలం ఆలయాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. విజయనగరంలో పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టుకు, ఓర్వకల్లులో రిలయన్స్ కన్జూమర్ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

====================

ఆయుష్ శాఖను పటిష్ట పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆయుష్ శాఖకు చెందిన పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లు మంత్రికి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశానికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆయుష్ శాఖను ఆదర్శంగా ఉంచేలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆయుష్ శాఖకు కేంద్రం 166 కోట్ల రూపాయలు విడుదల చేసిందని, ఈ శాఖకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయని చెప్పారు. ధర్మవరం, కాకినాడలో కొత్తగా ఆయుర్వేద కళాశాలలు మంజూరు చేశామన్నారు. విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం స్టైఫండ్ ను పెంచిందని మంత్రి తెలియజేశారు.

====================

బాలికలు, మహిళలపై దుశ్చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ స్పష్టం చేశారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్, ఏపీ మహిళా కమిషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో స్పాట్ లైట్ సెషన్ ను ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళా సమస్యల సత్వర పరిష్కారానికి త్వరలో ఆన్ లైన్ పోర్టల్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. చిన్నారులు, బాలికలు, మహిళలు స్వేచ్ఛగా, సంతోషంగా జీవించే హక్కు కలిగి ఉన్నారని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పని ప్రదేశాలలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళా కమిషన్ విధులు, విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఛైర్‌పర్సన్ విజ్ఞప్తి చేశారు.

విరామం

====================

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కాకినాడ పార్లమెంటు సభ్యులు, జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) ఛైర్ పర్సన్ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జరిగిన దిశ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ఫలాలు మరింత మందికి చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో పని చేయడానికి ఏయే నైపుణ్యం కలిగిన వారు ఎంతమంది అవసరమో వివరాలు సేకరించి నివేదిక సమర్పించాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారిని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తీరు, సమన్వయం, పర్యవేక్షణకు దిశ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సమావేశంలో వివరించారు.

====================

జీఎస్టీ రేట్ల తగ్గింపుతో సామాన్యులకు ఊరట లభిస్తుందని ఉత్తరాంధ్ర జిల్లాల జీఎస్టీ నోడల్ అధికారిణి స్వప్నాదేవి అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శ్రీకాకుళంలో ఈరోజు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన

సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే విధంగా జీఎస్టీలో సంస్కరణలు చేపట్టిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. ఈ సంస్కరణల తరువాత అనేక వస్తువుల ధరలు తగ్గాయని, దీనివల్ల ప్రజలకు ఆర్థిక భారం తగ్గి, పండుగలను మరింత ఆనందంగా చేసుకునే అవకాశం లభిస్తుందని పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

====================

బాలికల స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదని ICDS చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జయంతి అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ మాహ్ కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె.. జిల్లా ప్రజా ఆరోగ్య నర్స్ అధికారి (డీపీహెచ్ఎన్ఓ) వీరమ్మతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జయంతి మాట్లాడుతూ.. బాలికలు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు.

====================

ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో వ్యవసాయ, ఉద్యానవన పంటలను వేయాలని యోచిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆ దిశగా ప్రణాళికలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో కలెక్టర్ ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల నుంచి ఆదాయం తీసుకురావడమే కాక, జిల్లాలోని ఎంపిక చేసిన చెరువులను ఫిష్ ట్యాంకులుగా మార్చేలా ఆలోచన చేసినట్టు వివరించారు.

====================

దక్షిణ ఒడిశా నుండి మన్నార్ గల్ఫ్ వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రస్తుతం దక్షిణ ఒడిశా నుండి కోస్తాంధ్ర, రాయలసీమ, తమిళనాడు మీదుగా సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, యానాంలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశం ఉందన్నారు. ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ఉరుములతో కూడిన మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వెల్లడించారు.

====================

భారత్ వెస్టిండీస్ పురుష జట్ల మధ్య ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా రెండవ టెస్ట్ మ్యాచ్ ఈరోజు ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు నష్టపోయి 318 పరుగులు చేసింది.

====================
====================